


— ప్రభాకర్

అందమైన భవనాలకూ—

ఖరీదైన జీవితాలకీ—

వాటితో పాటు మురికి వీధులు, చీకటి వ్యాపారాలు ఆ నగరం ప్రత్యేకతలు. ఆ నగరంలో గొప్ప వాళ్ళు హైక్లాస్‌గా బ్రతికేయగలరు. క్రింద తరగతి వాళ్ళు కాయకష్టం చేసి బ్రతికేస్తారు.


అటూ, యిటూ కాని మధ్య తరగతి ప్రజలు, యిరుకు వీధులలో కాపురం చేస్తూ బ్రతుకు భారంగా వెళ్ళదీస్తుంటారు. ఉన్న సమస్యలు చాలవన్నట్లు వాళ్ళను యింకా యిరుకులో పెట్టడానికి ఒక హాస్పిటల్ ఉంది.

నగరం నడిబొడ్డున ఉన్న హాస్పిటల్ రాష్ట్రమంతటికి పెద్దది.

నగరం చివర్న సముద్రం

ఉంది. సాయంత్రం అందరూ చల్ల గాలికి, పిల్లగాలులకి అక్కడికి పోతుంటారు. ఉదయం హాస్పిటల్‌కు వచ్చిపోయే జనాన్నిచూస్తే హాస్పిటలే ఒక మహా సముద్రం లాగ ఉంటుంది.

ఎక్కడ చూసినా హనుమంతుడి తోకలాంటి క్యూలు, వాళ్ళని చీటికి మాటికి గదమాయిస్తూ ఆనందించే హాస్పిటల్ బాయ్‌లు,



తెల్లకోట్ల డాక్టర్లు, స్టూడెంట్స్, దళారీలు (వీళ్ళనే హాస్పిటల్ భాషలో 'పెంట్స్' అంటారు) కనపడుతూ ఉంటారు.

పేరు పొందిన ప్రభుత్వం వారి ధర్మాసుపత్రి. యింక జనానికేమి లోటు? ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది.

పేరులో తప్ప ఎక్కడా 'ధర్మం' కనిపించదనీ, జలగల్లా డబ్బు పీల్చేస్తారనీ, గోడలు తప్ప ప్రతివారూ చేయి చాపుతారనీ అధిక సంఖ్యాకులు గోల పెడుతుంటారు. ఆ గోల వినీవిననట్లు ఊరుకుంటారు అధికార్లు.

ఆ నగరంలోనే కాక, ఆ చుట్టు ప్రక్కల అంతా కనకరాజు గారంటే మంచి పేరుంది.

కనకరాజుగారు పేరు పొందిన జనరల్ సర్జన్! ఆయన మీద ప్రజలకి రకరకాల అభిప్రాయా లున్నాయి.

ఆయన పేషంట్లు....

హస్తవాసి చాలా మంచిదనీ, చేపట్టిన కేసు ఫెయిల్యూర్ అంటూ ఉండదనీ, ఆయన కత్తిపడితే శవాలు కూడా లేచి కూర్చుంటా యనీ అంటారు.

ఆయన స్టూడెంట్స్...

పాఠాలు బాగా చెప్తారనీ. పంక్చ్యువాలిటీకి ఆయననే ప్రథమంగా చెప్పుకోవాలనీ అంటారు.

ఆయన అసిస్టెంట్లు...

అనవసరంగా ఆపరేషన్లు చేయనివ్వని ఆయన జడ్జిమెంటును, స్పీడ్‌ను, టెక్నిక్‌ను మెచ్చుకుంటారు. ఆయన సర్జరీను చూడడం 'కన్నుల పండుగ'గా వర్ణిస్తారు.

ఏవరూ మెచ్చనిదీ, నలుగురికీ నచ్చనిది ఆయన ధనదాహం!

డబ్బు దగ్గర ఆయన చాలా నిక్కచ్చిగా ఉంటాడు.

'మాస్టర్ ఆఫ్ సర్జరీ' డిగ్రీ తీసుకున్నప్పుడే 'కాసు పడితేగాని కత్తి పట్టనని ప్రమాణం చేసి ఉంటాడని' అందరూ అంటారు.

రేట్ల విషయంలో సాక్షాత్తూ ఆ భగవంతుడు దిగి వచ్చినా ఆయన తగ్గడు. ఏ మాత్రం కన్సెషన్‌లు యివ్వడు.

కన్సల్టేషన్‌కు ఒక రేటు.

అందులో మొదటి కన్సల్టేషన్‌కు ఒక రేటు, తర్వాత కన్సల్టేషన్లకు ఒక రేటు.

ఆపరేషన్లు చేయడానికి ఒక రేటు. మైనర్ సర్జరీకి తక్కువగా, మేజర్ సర్జరీకి భారీగా తీసుకుంటారు.

రేట్ల విషయంలో ఆయనకు గొప్పా, బీదా ప్రసక్తి లేదు. ఈ విషయంలో అందరూ ఆయన దృష్టిలో ఒక్కటే!

అయితే పేరు పొందిన హస్తవాసి గల సర్జన్ కాబట్టి జనం వస్తూనే ఉంటారు.

ఆయన ప్రాక్టీసు పాపం పెరిగినట్లు పెరిగిపోతూనే ఉంది.

ఇలా ఉండగా ఒక శుభ ముహూర్తాన...

రాంబాబు పద్మవ్యూహం లాంటి ఆ హాస్పిటల్‌లో ప్రవేశించాడు-రంగనాధం గారిని తీసుకొని.

రాంబాబు భావి భారత పౌరులను తీర్చిదిద్దే టీచర్. ప్రజల భాషలో 'బ్రతకలేని బడిపంతులు.' అందులోనూ ఎలిమెంటరీ స్కూల్

టీచర్.

రంగనాధంగారు రాంబాబు తండ్రి, రిటైర్డ్ టీచర్!

రిటైర్డ్ అయినాక అందరి లాగ 'కృష్ణా!రామా!' అనుకోకుండావంశ పారంపర్యంగా తమ నుదుట ఈ వృత్తిని వ్రాసి పడేసిన ఆ విధాతని తీరిక వేళల్లో తిట్టుకుంటూఉంటాడు.

ఆయన కడుపులో ఆకలి లేదు గాని 'అల్సర్' ఉంది.

అల్సర్'కి ఆపరేషన్ కావాలి!

అదీ కనకరాజుగారే చెయ్యాలి!

ఇదీ ఆయన కోరిక! చాలా ఖరీదైన కోరిక!

ప్రావిడెండ్ ఫండ్ లోను తీసుకొని తండ్రితో సహా ధైర్యంగా ఆ పద్మవ్యూహం లోనికి ప్రవేశించాడు.

అడుగడుగునా సైంధవులలా అడ్డుపడే వార్డ్ బాయ్‌లను, డైట్ షీట్‌లు వ్రాసే గుమాస్తాలను ఉచిత రీతిన సంతృప్తి పరచి, ఎలాగైతే నేం- చివరకు తండ్రిని కనకరాజు గారి సర్జికల్ యూనిట్‌లో చేర్చాడు. బెడ్‌లో చేరగానే ఆపరేషన్ అయిపోయినంత సంబరపడిపోయాడు ముసలాడు. ఇల్లలకగానే పండుగ అయిపోతుందా?

రకరకాల పరీక్షలు చేసారు. స్టూడెంట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, హౌస్‌సర్జన్లు, అసిస్టెంట్లు అందరూ చూసారు. అల్సర్ ఉందన్నారు. ఆపరేషన్ చేయాలన్న ఏకాభి ప్రాయానికి వచ్చారు. కాని. . .

ఛీఫ్ కనకరాజు గారు పెదవి కదపటం లేదు.

రాంబాబు జేబులో డబ్బు, మంచు కరిగి పోతున్నట్లు తరిగి పోతున్నది. అతని అవస్థ చూసి 'టీ' రూపాయి తీసుకుని, వార్డు బాయ్ అప్పారావుకి గీతోపదేశం చేశాడు.

"సూడు పంతులూ! ఇట్టా రోజూ నువ్వు పదిసార్లు వచ్చినా, సచ్చిగీపెట్టినా, డబ్బు కక్కందే పని జరగదు. పెద్ద డాక్టర్ చెయ్యి పడాలంటే డబ్బులు పడాలి. ఏటన్నావ్ ముసలోడికి- అల్సర్ గదా? జి. జె. పెద్ద ఆపరేషన్ సెయ్యాల. రేటు తెల్సా? మూడొందలు. నా మాట వినుకొని అప్పుచేసో, కన్న మేసో దక్షిణం సెల్లించుకో! నీ పని సెనంలో జరిగిపోతుంది. నేక పోతే యిట్టా కాల్లలో సెక్రాలు వేసుకుని తిరగాలప్పిందే."

రాంబాబుకు జ్ఞానోదయం అయింది!

ఆ సాయంత్రమే కనకరాజు గార్ని యింటి దగ్గర కలిసాడు. విషయం చెప్పాడు. బ్రతక లేని

బడి పంతులిననీ, కనికరించమనీ తన దగ్గర ఉన్న రెండొందల యాభై రూపాయలు టేబిల్ మీద పెట్టాడు.

డబ్బు లెక్క పెట్టుకున్నారు. ఫిక్స్‌డ్ రేటుకన్నా యాభై తక్కువ!

మూడు వేళ్ళు చూపెట్టారు-తన రేటు మూడొందలని తెలియ జేస్తూ. ఆయన మితభాషి. అనవస రంగా నోరు విప్పరు.

రాంబాబు యింతే వుందని చెప్పాడు.

"ఊర్లో రెండొందలకే చేసే చెట్టు క్రింద డాక్టర్లు ఉన్నారు. వాళ్ళ దగ్గరకు పో" అన్నారు.

రాంబాబు బయటకు వచ్చాడు.

"ఛీ! ఏం మనిషి? కేవలం యాభై రూపాయలు తక్కువయ్యాయని ఎంత నీచంగా మాట్లాడాడు? చేతిలో ఎంత విద్య ఉంటే నేం? హృద యంలేని మనిషి" అనితిట్టుకున్నాడు.

చేతి వాచీ అమ్మేసి మూడు వందలు తాంబూలం సమర్పించు కున్నాడు.

చివరకు సాధించాడు!

లక్ష్మివారం ఉదయం 'ఫస్ట్ కేస్' రంగనాథం గారిదే!

లక్ష్మివారం-
ఉదయం తొమ్మిదిగంటలైంది.

అపుడే రంగనాథంగారిని థియే టర్ లోనికి తీసుకొని వెళ్ళారు.

వరండాలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు రాంబాబు. 'ఈ వయస్సులో అపరేషన్- ముసలా యన తట్టుకొని క్షేమంగా బయటకు వస్తాడా-రాడా?' అన్న సందేహం అతన్ని పురుగులా తినేస్తుంది.

'ఛ-ఛ! కనకరాజుగారు చెయ్య డం-ఫెయిల్యూరా? నెవర్!' అని మనస్సు మళ్ళీ ధైర్యం చెపుతుంది.

టేబిల్ మీద రంగనాథంగారు కదలలేకుండా పడుకొన్నారు.

అనస్తెటిస్ట్ 'జనరల్' యిచ్చి రెడీగా ఉన్నాడు.

అసిస్టెంట్ 'అబ్డమిన్' క్లీన్ చేసి, 'స్టెరిల్ టవల్స్' కప్పి ఛీఫ్‌కి 'రంగం' సిద్ధం చేశాడు.

ఛీఫ్ వచ్చారు. అందరూ విష్ చేశారు.

అనస్తెటిస్ట్ 'రెడీ' అనగానే ఆయన చేతి వ్రేళ్ళు సున్నితంగా కదిలాయి. బ్లేడ్ అబ్డమిన్‌ను

చీల్చింది.

సర్జరీ జరుగుతున్నంత సేపూ ఆయన మాట్లాడరు. అసిస్టెంట్ స్టాఫ్ ఆయన కదలికలు అర్థం చేసుకొని వ్యవహరిస్తూ ఉండాలి.

'జి. జె. అండ్ వేగాటమీ' సక్రమంగా జరిగిపోయింది.

పెరిటోనియమ్ క్లోజ్ చేయడం పూర్తి అయ్యింది. అప్పుడు అసిస్టెంట్ గమనించాడు- ఛీఫ్ వ్రేళ్ళు కొద్దిగా వణకడం....

వెరీ అనూజువల్ ఫర్ దిస్ సర్జన్.

"నేను క్లోజ్ చేసేస్తాను సార్!" అన్నాడు అసిస్టెంట్ అది గమనించి.

"థాంక్యూ!" అని గ్లవ్స్ తీసేసారు. అసిస్టెంట్ క్లోజ్ చేసేస్తున్నాడు స్టాఫ్ సహాయంతో.

అనస్తెటిస్ట్ పేషంటును 'రికవర్' చేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఇంతలో ఎవరో క్రింద పడినట్లు 'దబ్' అన్న శబ్దం వినిపించింది.




"సార్! ఛీఫ్ వాష్ బేసిన్ దగ్గర పడిపోయారు" అంటూ థియేటర్ బాయ్‌లు పరుగెత్తు కొచ్చారు.

అందరూ పరుగెత్తారు. ఛీఫ్‌ను ట్రాలీమీద పడుకోబెట్టారు. శరీరం అంతా చమటతో తడిపి మంచు ముద్దలాగ ఉంది.

ఆయన మాట్లాడలేక పోతు న్నారు. 'నొప్పి' అన్నట్లు ఛాతీ వైపు చూపించారు.

వెంటనే 'మార్ఫిన్' ఇచ్చారు. దాదాపు పరిగెత్తుకొంటూ వచ్చాడు కార్డియాలజిస్ట్.

పల్స్ అందటం లేదు. బ్లడ్ ప్రెషర్ తెలియటంలేదు.

మైగాడ్! మాసివ్ ఇన్‌ఫార్ క్షన్!(గుండెపోటు)

Electro Cardiogram (E. C. G.) లో వెంట్రిక్యులర్ ఫిబ్రి లేషన్ కూడా ఉంది.

ఎవరి ప్రయత్నాలూ ఫలించ లేదు. కనకరాజుగారి గుండె ఆగి పోయింది.

వార్డ్‌బాయ్‌లు, డాక్టర్లు హడా విడిగా లోనికి బయటకు పరు గెత్తడం రాంబాబుని కంగారు పెట్టేశాయి. 'తన తండ్రికి ఏమైనా అయిందా?'

ఇంతలో ట్రాలీని నెట్టుకుంటూ వార్డ్‌బాయ్‌లు బయటకు వచ్చారు విచారంగా. రాంబాబు కంగారుగా ముందుకు వెళ్ళాడు.

దానిమీద నిర్జీవంగా పడుకొని ది గ్రేట్ సర్జన్ కనకరాజుగారు!

రాంబాబుతోపాటు అక్కడున్న అందరూ ఆశ్చర్యంగా నోరు తెరచుకొని ఉండిపోయారు.

"మాయదారి గుండెపోటు పెద్ద డాక్టర్‌గారిని పొట్టన బెట్టుకుంది." థియేటర్ బాయ్ జోగులు విచా రంగా అన్నాడు.

ఈవార్త తెలిసిన హాస్పిటల్ స్టాఫ్ మెల్లిగా అక్కడ చేరసాగారు.

వెనకాల ట్రాలీమీద రంగనాథం గారు కులాసాగా బయటకు వచ్చారు.

రాంబాబు కళ్ళనుండి రెండు కన్నీటి చుక్కలు రాలి నేలను తాకాయి.

అవి తండ్రి క్షేమంగా వచ్చి నందుకు ఆనందబాష్పాలో, సర్జన్ కనకరాజుగారి ఆకస్మిక మృతికి దుఃఖాశ్రువులో?

బ్రతికినన్నాళ్ళూ 'హృదయం లేని మనిషి' 'పాషాణం' అని పించుకొన్న కనకరాజుగారు 'గుండె పోటు' తో చనిపోతూ తనకూ 'హృదయం ఉంది' అని నిరూ పించుకున్నారు. *